## క్లుప్తంగా

### మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం నేడు

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం సాయంత్రం 4 గంటలకు పట్టణంలోని కాకాణి నగర్, టైలర్స్‌కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని వైఎస్సార్‌సీపీ నేత అంజాద్ శనివారం తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

**ఆర్యవైశ్యులతో ఆత్మీయ సమావేశం**

ఎన్నికల ప్రచారం పూర్తయిన తర్వాత మంత్రి కాకాణి పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొంటారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని ఆర్యవైశ్య సంఘ నేత ఆదూరు వెంకటసుబ్బయ్య వెల్లడించారు.

### వెంకయ్యస్వామికి విశేష పూజలు

మనుబోలు : మండల పరిధిలోని మనుబోలు–చెర్లోపల్లి రైల్వే గేటు సమీపంలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్యస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. అర్చకుడు శ్రీనివాసులు స్వామివారికి క్షీర, పంచామృతాభిషేకాలను శాస్త్రోక్తంగా జరిపించి ప్రత్యేకాలంకరణ చేశారు. అనంతరం ఆలయం వద్ద భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఉభయకర్తలుగా గంధం కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు వ్యవహరించారు.

### వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీలక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో మాఘ మాసం సందర్భంగా శనివారం స్వామి అమ్మవార్ల పల్లకిసేవ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకాలంకరణ గావించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అభిషేకాలు, పూజలు చేశారు. భక్తులకు ప్రసాదాలు అందజేశారు.

### టీడీపీ నేత భూ ఆక్రమణ

• అధికారులకు ఫిర్యాదు

తోటపల్లిగూడూరు : ఓ టీడీపీ నేత ఆక్రమణల నుంచి తన భూమిని విడిపించాలని తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం, ఏరూరు గ్రామానికి చెందిన పూడిపర్తి సుధాకర్‌రెడ్డి శనివారం తహసీల్దార్ మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వరిగొండ పంచాయతీ సర్వే నంబరు 584లో 98 సెంట్లు, సర్వే నంబర్ 585లో 91 సెంట్ల పట్టా భూమి ఉందన్నారు. దీని పక్కన నెల్లూరుకు చెందిన ఓ టీడీపీ నేత గోల్డెన్ సిటీ పేరుతో వెంచర్ వేశాడన్నారు. ఈ క్రమంలో తన 98 సెంట్ల భూమిని అందులో కలిపేసుకునే ప్రయత్నం చేయగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి ముళ్లకంచె ఏర్పాటు చేశానన్నారు. దీనిపై లేఅవుట్ వారు కోర్టుకు వెళ్లడంతో స్టేటస్‌కో ఇచ్చిందన్నారు. అయితే కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా లేఅవుట్ వారు ఫెన్సింగ్ రాళ్లను కూల్చివేశారన్నారు. దీనిపై ప్రశ్నిస్తే సదరు టీడీపీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.



ప్రజలను కలిసేందుకు బస్సు దిగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



# అదే ఆత్మీయత ఆప్యాయత

• కోవూరులో ఉప్పొంగిన అభిమానం

కోవూరు : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్ర కోవూరు నియోజకవర్గంలో కోలాహలంగా జరిగింది. కోవూరు మండల కేంద్రంతో పాటు, రాజుపాళెం మీదుగా బస్సుయాత్ర జరగ్గా, తమ అభిమాన నాయకుడిని చూసేందుకు వేలాది మంది స్వచ్ఛందంగా తరలివచ్చారు. కోవూరు, ఇందుకూరుపేట, కొడవలూరు, విడవలూరు, బుచ్చి మండలాల నుంచి భారీ సంఖ్యతో ప్రజలు కోవూరు ఆర్కే పెట్రోల్ బంక్ వద్దకు, రాజుపాళెం సెంటర్ వద్దకు చేరుకున్నారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. సీఎం జగన్ బస్సు యాత్ర కోవూరులోకి ప్రవేశించిన వెంటనే అభిమానులు కేరింతలతో హోరెత్తించారు. దీంతో ఆ ప్రాంతమంతా జగన్ నామస్మరణతో మార్మోగిపోయింది. సీఎం జగన్ బస్సుపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తుంటే ప్రజలు ఉప్పొంగిపోయారు. ఆయన్ను సమీపాన్ని చూసేందుకు, వీలుపడితే కరచాలనం చేసేందుకు పోటీపడ్డారు. కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సూచనల మేరకు కోవూరులో డీఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, నార్తురాజుపాళెంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ విజయసాయిరెడ్డి. ఎమ్మెల్యే ప్రసన్న

## సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష

• కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి శ్రీరామరక్ష అని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రలో భాగంగా నార్తురాజుపాళెంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోకి ప్రవేశించిన సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందనేందుకు ఇదే నిదర్శనమన్నారు. పేదలు, పెత్తందారుల మధ్య ఎన్నికల జరగబోతున్నాయని, ఈ కురుక్షేత్రంలో పేదలందరూ జగన్‌వైపు ఉన్నారన్నారు. అన్ని పార్టీల వారు జగన్‌కు జేజేలు పలికేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాల వల్లే రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో వైఎస్సార్‌సీపీ భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు ఎన్ని పొత్తులతో వచ్చినా జగన్ సింగిల్‌గా వచ్చి సీఎం అవుతారని ప్రసన్నకుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.



సీఎం జగన్‌ను చూసేందుకు వచ్చిన వృద్ధురాలిని పలకరిస్తున్న ప్రసన్న





అభిమాన నాయకుడి కోసం బారులు తీరిన ప్రజలు

### జగనన్న ఆశీస్సులు పొందాను



సీఎం జగన్‌తో కౌన్సిలర్ షకీలా

సీఎం జగనన్న ఆశీస్సులు పొందడం సంతోషంగా ఉంది. రంజాన్ మాసంలో ఇది జరగడం మరింత ఆనందంగా ఉంది. ఇదే విషయాన్ని జగన్ సార్‌కు చెప్పాను. పేదలందరూ వైఎస్సార్‌సీపీ వైపు ఉన్నారు. రెండోసారి సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత బుచ్చిరెడ్డిపాళెం రావాలని కోరాను.

– షకీలా, ఏడో వార్డు కౌన్సిలర్, బుచ్చిరెడ్డిపాళెం

### ఆనందంగా ఉంది



అన్నివర్గాల వారికి మేలు చేసిన జగనన్నను దగ్గరగా చూడడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన పలకరింపు కొత్త ఉత్సాహాన్ని నింపింది. వలంటీర్లుగా పేదలకు సేవ చేసుకునే భాగ్యం ఆయన కల్పించారు. ప్రస్తుతం తమపై ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయి. అందుకే వలంటీర్లుగా రాజీనామా చేసి జగనన్న విజయం కోసం పనిచేస్తున్నాం.

– జి.ఉమా, రాజుపాళెం

### జగనన్న గెలుపు కోసం పనిచేస్తా



సీఎం జగన్ సార్‌ను దగ్గరగా చూడడం ఎంతో సంతోషంగా ఉంది. ఆయన పాలనలో వలంటీర్‌గా మాకు వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సేవ చేసే భాగ్యం లభించింది. ఎన్నికల పేరుతో ప్రతిపక్షాలు తమను దూరం పెట్టించడం దారుణం. జగనన్న గెలుపు కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తా.

– పీవీ శ్రావణి, రాజుపాళెం



ప్రజలతో కలిసి వేచి ఉన్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

మహిళల కేరింతలు



# వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం ఖాయం

• కావలి సభకు స్వచ్ఛందంగా తరలివెళ్లిన ప్రజలు, నాయకులు

వెంకటాచలం : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తిరుగులేని విజయం సాధించడం ఖాయమని, మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అవుతారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. కావలిలో శనివారం జరిగిన మేమంతా సిద్ధం సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బస్సులు, కార్లలో భారీగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వెంకటశేషయ్య మాట్లాడుతూ సీఎం సభకు ప్రజా స్పందన చూస్తుంటే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు భారీ మెజారిటీతో విజయం సాధిస్తారనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు. గతంలో ఎవరికీ సాధ్యంకాని విధంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించడంతో ప్రజలు నీరాజనాలు పలుకుతున్నారని తెలియజేశారు.

➔ **ముత్తుకూరు** : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కావలిలో చేసిన మేమంతా సిద్ధం సభకు ముత్తుకూరు మండలం నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. బస్సులు, వ్యాన్లు, కార్లు, ద్విచక్ర వాహనాల ద్వారా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మండుటెండను లెక్కచేయకుండా కావలి వైపు పయనమయ్యారు. రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు జై జగన్ అని నినాదాలు చేసుకొంటూ ఉత్సాహంగా బయలుదేరి వెళ్లారు.

➔ **పొదలకూరు** : కావలిలో జరిగిన మేమంతా సిద్ధం సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతలు భారీగా తరలివెళ్లారు. గ్రామాల నుంచి నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ప్రత్యేక వాహనాల్లో బయలుదేరి వెళ్లారు.

➔ **మనుబోలు** : కావలిలో తలపెట్టిన మేమంతా సిద్ధం సభకు మనుబోలు మండలం నుంచి భారీగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు తరలివెళ్లాయి. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపుతో మండలంలోని 14 సచివాలయాల నుంచి 16 బస్సుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. మనుబోలు మండల కేంద్రం నుంచి పార్టీ మండల కన్వీనర్ బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో రెండు బస్సుల్లో కార్యకర్తలు తరలివెళ్లారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు వల్లూరు హర్షవర్ధన్‌రెడ్డి, చేడిమాల బుజ్జిరెడ్డి, గుండాల ఆదినారాయణ, ఏడెం మల్లికార్జునరెడ్డి, మారంరెడ్డి ప్రదీప్‌రెడ్డి, మన్నెమాల సుధీర్‌రెడ్డి, కసిరెడ్డి ధనుంజయరెడ్డి తదితర నాయకులు ఆయా గ్రామాల నుంచి బస్సుల్లో కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లారు.

➔ **తోటపల్లిగూడూరు** : కావలిలో జరిగిన మేమంతా సిద్ధం సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు శనివారం పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ ఆధ్వర్యంలో 22 ఆర్టీసీ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో దాదాపు 2 వేల మంది వరకు మండలం నుంచి వెళ్లినట్లు తెలిసింది.

➔ **ఇందుకూరుపేట**: కావలిలో మేమంతా సిద్ధం సభకు మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివెళ్లారు. ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఇందుకూరుపేట కో–ఆపరేటివ్ రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డితో పాటు ఆయా గ్రామాల నాయకుల ఆధ్వర్యంలో అభిమానులు, ప్రజలు సిద్ధం సభకు జై జగన్ అంటూ నినాదాలు చేసుకుంటూ తరలివెళ్లారు.



వెంకటాచలం నుంచి తరలి వెళ్తున్న నాయకులు, కార్యకర్తలు



మనుబోలు నుంచి..



ముత్తుకూరు : తాళ్లపూడి నుంచి..



మనుబోలు : బస్సులో వైఎస్సార్‌సీపీ నాయకులు



తోటపల్లిగూడూరు : వరిగొండ నుంచి..



ఇందుకూరుపేట: రావూరు నుంచి..

### వలంటీర్ల రాజీనామా

ఇందుకూరుపేట : మండలంలోని జగదేవిపేటకు చెందిన వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు 20 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లుకు అందజేశారు. ప్రజాసేవకు తమను దూరం చేయడాన్ని నిరసిస్తూ రాజీనామా చేశామని, రాబోయే రోజుల్లో చంద్రబాబుకు సరైన గుణపాఠం చెబుతామని వారు పేర్కొన్నారు.



ఇందుకూరుపేట : రాజీనామా పత్రాలను సమర్పిస్తున్న వలంటీర్లు

➔ విడవలూరు: వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుని మళ్లీ విధుల్లో చేరుతామని విడవలూరు బిట్–1, బిట్–2 వలంటీర్లు అన్నారు. స్థానిక సచివాలయంలో వారు శనివారం మూకుమ్మడిగా రాజీనామాలు చేశారు. అనంతరం ఆ పత్రాలను సచివాలయ సెక్రటరీ హరిప్రసాద్‌కు అందజేశారు.



విడవలూరు సచివాలయంలో..

### బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం : మోటార్ బైక్ అదుపుతప్పి పడడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని కనుపూరు సమీపంలో శనివారం జరిగింది. బుజబుజనెల్లూరు ప్రాంతానికి చెందిన మున్వర్ పని నిమిత్తం కనుమూరుకు వెళ్తుండగా, కనుపూరు సమీపంలో టిప్పర్ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో మున్వర్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు.